జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

మంగళవారం | 06-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 801 పేజీలు: 4 వెల: రూ.7

# ఇచ్ఛాపురం మున్సిపల్ ఎన్నికల్లో..

# కూటమి గాలి?





* వైసీపీ చైర్మన్ అభ్యర్థి ఖరారైందంటూ పుకారు
* పాత అభ్యర్థి అయితే గెలుపు మరింత సులువు అని టీడీపీ నేతల ధీమా
* శ్యామ్‌కి చెక్ పెట్టేందుకు ఒక్కటవుతున్న వైరి వర్గాలు
* ఒకే దెబ్బకు రెండు పిట్టల ఫార్ములా
* పాత వ్యక్తికి టికెట్ ఇస్తే ఇండిపెండెంట్‌గా బరిలోకి పలువురు
* టికెట్ కోసం దరఖాస్తు చేసిన మైనార్టీ వ్యక్తిపై దాడికి యత్నం

శ్రీకాకుళం, అక్టోబర్ 5 (వార్త): గతంలో ఒక కథ ఉండేది ఒక రొట్టె ముక్క కోసం రెండు కోతులు గీసుకుని ఆడుకుంటే అది కాస్త ఇంకెవరికో దక్కిందట. ఎక్కడైనా తమ పార్టీలో ఎవరికి టికెట్ వస్తే గెలుస్తామని లెక్కలు వేసుకోవడం సహజం కానీ ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో అందుకు భిన్నంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో గతంలో ఉన్న పాత అభ్యర్థి చైర్మన్ రేసులో టికెట్ ఖరారు అయినట్లు పుకార్లు రావడంతో ఆ పార్టీలో మున్సిపల్ ఆశావాహుల్లో నైరాశ్యం నెలకొనగా, తెలుగుదేశం పార్టీ ఆశావహులు మాత్రం సంబరాలు చేసుకుంటున్నారు. పాత అభ్యర్థి కావడం గతంలో పరిపాలన దక్షిత లేకపోవడం, అభివృద్ధి కుంటుపడడం వంటి లోపాలు తమ పార్టీ అభ్యర్థి గెలుపునకు ఖాయమని బేరీజు వేసుకుంటున్నారు. మరోవైపు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి నాయకత్వాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ప్రత్యర్థులు అంతా ఏకమై శ్యాం కి చెక్ పెట్టేందుకు గట్టిగా పావులు కదిపినట్లు సమాచారం. ఇందులో భాగంగానే పాత అభ్యర్థుల బరిలోకి దింపితే ఎలాగో ఓటమి ఖాయమని గతంలో రెండు సార్లు మున్సిపాలిటీ గెలిచి శ్యామ్ నాయకత్వంలో ఓటమిపాలైతే అది శ్యామ్ వైఫల్యంగా అతని మీదకు నెట్టేయవచ్చని ఫలితంగా అటు చైర్మన్ అభ్యర్థిని ఇటు శ్యామ్‌ని ఇద్దరినీ చెక్ పెట్టి ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనేలా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం టికెట్ రేసులో పేరు వినిపిస్తున్న ఈ అభ్యర్థి గతంలో ఎమ్మెల్యే టికెట్ రేసు లో కూడా ప్రయత్నించగా అదే సామాజిక వర్గానికి చెందిన 250 మంది ఫిర్యాదు పత్రాన్ని ఆ పార్టీ అధ్యక్షుడికి పంపినట్లు సమాచారం. ఇందులో మున్సిపాలిటీ నుండి సుమారు 50 మంది వరకు సంతకాలు చేసినట్లు బోగట్టా. ఎటొచ్చి తిరిగి టిక్కెట్టు అటువంటి వ్యక్తికే కేటాయించడంపై ఇతర ఆశావాహులు లోలోపల రగిలిపోతున్నారు. గతంలో ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిపి భుజం భుజం రాసుకుంటూ చెట్టాపట్టాలేసుకుని తీర్థయాత్రలకు, విహారయాత్రలకు వెళ్లిన సందర్భాలను పక్కనపెట్టి మరోసారి టికెట్ కేటాయించడం ఏమిటని గట్టిగా నిలదీస్తున్నారు. మున్సిపాలిటీలో గెలుస్తున్నప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఎందుకు మెజార్టీ రావడంలేదని ప్రశ్నించుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఎవరు సమన్వయకర్తగా పనిచేసిన ఎవరు ఎమ్మెల్యేగా పనిచేసిన మున్సిపాలిటీలో వేలు పెట్టకూడదని అన్ని బీఫారాలు తనకే ఇవ్వాలని అన్ని బూత్ ఫారాలు తనకు ఇవ్వాలని పట్టు పట్టడం ప్రతి ఎన్నికల్లో పరిపాటి. ఒకవేళ ఓడిపోతే ఓడిపోయిన అభ్యర్థి పై నెట్టేసే ప్రయత్నం. ఇదే ప్రయత్నం గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది మున్సిపాలిటీలో 28 వార్డుల్లో గాను సుమారు 10 వార్డుల వరకు దీటైన అభ్యర్థి లేడని విశ్వసనీయ సమాచారం. కొన్ని వాటిల్లో డమ్మీ అభ్యర్థులు నిలబెట్టి ప్రత్యర్థి పార్టీలో ఉన్న స్నేహితులను గెలిపించేందుకు ఖచ్చితంగా గెలుస్తాడు అనే ధీమ వ్యక్తం చేసే అభ్యర్థిని సైతం వరుసుగా రెండు ఎన్నికల నుండి టికెట్లు ఇవ్వకుండా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి పరోక్షంగా సహకరించడం వంటి అంశాలు ఉన్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీలో తెలుగుదేశం బలం మొన్నటి వరకు అంతంత మాత్రమే. ఎమ్మెల్యే అశోక్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడులు ప్రత్యేకంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీపై కన్నేశారు. ఫలితంగా పాలకవర్గం దిగిన వెంటనే సెంట్రల్ లైటింగ్ వెలిగించి కూటమి పాలాన రుచి ఏమిటో ప్రజలకు చూపించారు. నాలుగు దశాబ్దాలుగా మున్సిపాలిటీలో ఉండి రెండు గ్రామాలు, నాలుగు వార్డులకు పైప్ లైన్ ద్వారా చుక్క నీరు ఇచ్చుకోలేకపోతున్నారు. వరుసగా వార్డులన్నీ గెలిపించి ఇస్తున్న వారికి మంచినీరు ఇవ్వాలని కనీస శ్రద్ధ చూపకపోవడం ఆ పార్టీకి ఆశనిపాతంలా మారింది. పక్కన ఉన్న గ్రామాల్లో 24 గంటలు పైప్ లైన్ ద్వారా తాగునీరు అందుతుంటే లక్షలాది రూపాయలు పన్నులు కట్టే తమకు తాగేందుకు గుక్కెడు నీరు దక్కక పోవడంతో లోలోపల రగిలిపోతున్నారు. వచ్చే ఎన్నికలలో గట్టిగా బుద్ధి చెప్పాలని భావిస్తున్నారు. ఇదే ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి గేమ్ చేంజర్‌లా మారింది. నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ ఏఐ ఐబి నిధులు సుమారు 60 కోట్ల రూపాయలతో పైప్ లైన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. దాదాపు పైప్ లైన్ పనులు పూర్తికావస్తున్నాయి. ఇది పూర్తి అయితే గేమ్ చేంజర్ కాబోతోంది. మొత్తం మీద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన పట్టు నిలుపుకోవాలంటే పాత స్థానాన్ని కనీసం కైవసం చేసుకోవాలంటే కొత్త ముఖానికి చైర్మన్ అభ్యర్థి టికెట్ కేటాయిస్తే తప్ప గెలుపు పవనాలు కష్టమేనని పరిశీలకులు భావిస్తున్నారు. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ మైనార్టీ యువకుడిపై తీవ్రంగా మాటలు దాడి చేసి భయపెట్టినట్లు సమాచారం. మరోవైపు జిల్లాలో ఓ నాయకుడు పదే పదే ఇచ్ఛాపురం మున్సిపాలిటీపై ఎందుకు అంత ప్రేమ ఓలక బోస్తున్నారో అర్థం కావడం లేదని వాదనలు కూడా వినిపిస్తున్నాయి. పాత ముఖానికి టికెట్ ఇస్తే ఇండిపెండెంట్ లు బరిలోకి దిగుతామని పార్టీకి చెందని తటస్థులు సుమారు 10 మంది బహిరంగాగా ప్రకటిస్తున్నారు. కొత్త వ్యక్తి అయితే పునరాలోచన చేస్తామని అంటున్నారు. హోటల్ యూనియన్ ప్రతినిధులు ఇప్పటికే రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. మొత్తం మీద ఎన్నికల కోడ్ రాకముందే డైలీ మార్కెట్‌ని మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దిన, సరే కుక్కలు కోతులు పసువుల స్వైర విహారం కి అడ్డుకట్ట వేసిన సరే కూటమి తన బెంచ్ మార్కును అవలీలగా దాటేస్తుంది. అదే అదునుతో ఈసారి తెలుగుదేశం పీఠం పక్కా చేసుకోవడం పక్కనే ప్రణాళికలు రచిస్తున్నారు. వైఎస్ఆర్సిపి అభ్యర్థిని మార్చి కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చి పట్టు నిలుపుకుంటుందో లేక ఎక్కువసార్లు గెలిచామని ఈ ఒక్కసారికి పక్క పార్టీకి వదిలేద్దామని బోరు కొట్టి పాత ముఖాలతోనే ఫైట్ లోకి దిగుతుందా వేచి చూడాలి. ఒకవేళ పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగి ఉంటే రెండు సార్లు గెలిచిన వార్డు కాకుండా పక్కవార్డు లో పోటీకి రూట్ మ్యాప్ వేసుకున్నారంటే అభివృద్ధి చేస్తే వార్డులో గెలుస్తామని ధీమా ఉండాలి కదా పక్కవార్డు వైపు చూపులు చూడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో తీసుకున్న గజముద్ద సాక్షిగా ప్రత్యర్థి పార్టీకి అవకాశం ఇచ్చి గెలిపించాలని ఆలోచన ఏమైనా ఉందా అని అదే పార్టీ నుండి ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త వార్డులో కూడా ఓ మాజీ సైనిక ఉద్యోగి తనపై పోటీకి దిగుతున్నాడు అంటే ఆ వార్డులో ఇల్లు లేకపోయినా ఓటు లేకపోయినా ఆ వ్యక్తికి అంత భయపడ్డారు అంటే ఓటమి భయం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. ఆ వ్యక్తిని పోటీ నుండి విరమించుకోవాలని ఇంటి పెద్దలు, కుల పెద్దలతో పలుమార్లు రాజీ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. పరోక్ష ఎన్నికలు అయి ఉంటే ఏదో ముక్కి మూలిగి ఒక వార్డ్ లో 100 ఓట్లు తేడాతో గెలిచి చైర్మన్ స్థానం అవలీలగా దక్కించుకోవచ్చునని ప్రయత్నాలకు ప్రత్యక్ష ఎన్నికలు పెద్ద దెబ్బే వేశాయి. లేదంటే ఒక్క వార్డు లో గెలిచి పై నుండి అధిష్టానం పదేపదే పేరు చెప్పిందని సీల్డ్ కవర్ రాజకీయాలు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. అధిష్టానంలో ఉండే ఆ నాయకుడు పేరు చెప్పాడని ప్రతిసారి జిల్లా నాయకుడే చెబుతుండడంతో ఎవరు అధిష్టానంకి వెళ్లి నిజంగా పార్టీ నాయకుడే పేరు చెప్పాడా అని తెలుసుకునే సాహసం కూడా చేసుకోలేరని నెపంతో ఇది కాస్త కలిసి వస్తుంది. మొత్తం మీద ఇటు శ్యామ్‌కు చెక్ పెట్టాలన్నా, మున్సిపాలిటీలో తెలుగుదేశం గెలవాలన్నా, పాత ముఖానికి టికెట్ ఇస్తారా లేక కొత్తవారితో ఢీకొంటారా వేచి చూడాల్సివుంది.

# ఆదిత్యుని ఆలయాభివృద్ధికి.. రూ.55.74 కోట్లు



* రెండేళ్లలో భక్తులకు మెరుగైన వసతులతో అభివృద్ధి
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, అక్టోబర్ 5 (వార్త): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయాన్ని స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద మంజూరైన రూ.55.74 కోట్లతో రానున్న రెండేళ్లలో సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర పర్యాటక శాఖ నుంచి నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉందని, శ్రీకాకుళం జిల్లా ప్రజల తరఫున కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అరసవల్లి ఆలయాన్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకుల వేద ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వదేశ్ దర్శన్ 2.0 కింద చేపట్టనున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు. గత రెండేళ్లుగా ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా పనులు వేగంగా పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు.భవిష్యత్‌లో పెద్ద ఎత్తున భక్తులు అరసవల్లి ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున, వారి అవసరాలకు అనుగుణంగా క్యూలైన్లు, కేశఖండన శాల తదితర సౌకర్యాలను ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.4 కోట్లతో పుష్కరిణి అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలో జరగనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రానున్న రోజుల్లో దేశంలోని ప్రముఖ ఆలయాల సరసన అరసవల్లి ఆదిత్యుని ఆలయం నిలిచేలా అభివృద్ధి చేస్తామని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అరసవల్లి ఆలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదని కేంద్ర మంత్రి అన్నారు. ప్రభుత్వం, ఆలయ అభివృద్ధిపై నమ్మకంతో స్థానికులు పూర్తి సహకారం అందిస్తున్నారని, అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనుకున్న మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, సంయుక్త కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ హరి ఓం పాండ్య, ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా యూరియా బస్తాలు తరలింపు

* ఒడిశా నుంచి పోలాకి మండలానికి తరలిస్తుండగా అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు
* 100 బస్తాల యూరియా స్వాధీనం
* వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగింత
* కేసు నమోదు

జలుమూరు, సెప్టెంబర్ 5 (వార్త): జలుమూరు మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న యూరియా బస్తాలను విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఒడిశా నుంచి పోలాకి మండలం డోల గ్రామానికి చెందిన డోల రమణమూర్తి వాహనంలో సుమారు 100 బస్తాల యూరియాను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్ఐ బి. రామారావు ఆధ్వర్యంలోని బృందం వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో యూరియా బస్తాలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న యూరియాను వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్‌కు అప్పగించారు. యూరియా అక్రమ తరలింపునకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం ఉద్దేశించిన ఎరువులను అక్రమంగా తరలించకుండా సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.





# దివ్యాంగురాలిపై అత్యాచారం

హిరమండలం, అక్టోబర్ 5 (వార్త): హిరమండలం పరిధిలోని ఓ దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి అత్యాచారం చేసినట్టు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. దామోదరరావు అనే వ్యక్తి ప్రతి నెలా ఇంటింటికీ వెళ్లి విద్యుత్తు మీటర్ల రీడింగ్ తీస్తుంటాడు. ఆదివారం రీడింగ్ తీసేందుకు దివ్యాంగురాలు ఉన్న ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఈ విషయాన్ని ఆమె తల్లికి చెప్పడంతో హిరమండలం పోలీసులను ఆమె ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆంధ్రా రైతాంగం నీటి సమస్య పరిష్కరించండి

**- ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు రైతాంగం విన్నపం**

**మెళియాపుట్టి, అక్టోబరు5(వార్త):** దశాబ్దాలుగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో ఆంధ్ర పైభాగంలో ఉన్న ఒరిస్సా రాష్ట్ర రైతులు తమ సరిహద్దులలో డ్యాములు, నదులకి అడ్డంగా ఎత్తుగా సిమెంట్ దిమ్మలను కడుతున్న మూలంగా దిగు ప్రాంతంలో ఉన్న ఆంధ్ర ప్రజలు నీటి సమస్యలను ఎదుర్కోవల్సిన పరిస్థితి ప్రతి ఏడాది ఇదే స్థితి కొనసాగుతుందని మా ఈ సమస్య పరిష్కరించండిని సోమవారం నాడు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఎంపీ క్యాంప్ ఆఫీసులో కేంద్ర విమానాయాశాఖ మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుకి మెళియాపుట్టి మండలం గంగరాజపురం గ్రామ పంచాయతీ పెద్ద జగన్నాధపురం దేశం పార్టీ సీనియర్ నాయకులు చక్రి, బుజ్జిలు కలిసి నీటి కొరకు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన ఈ విషయమే స్పందిస్తూ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడుతూ పక్కనే ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడారని చక్రి, బుజ్జిలు తెలిపారు. అయితే ఇది ఒక్క జగన్నాధపురం, గంగరాజుపురం గ్రామ రైతుల సమస్య కాదని, ఆంధ్ర పైభాగంలో ఉన్న ఒడిస్సా అవకాశమున్న ప్రతి దగ్గర ఇలా నీటిని ఇతర చానల్స్ ద్వారా వారు పొలాలకు మళ్లించి కిందికి వెళ్లే నీటి శాతాన్ని తగ్గించే క్రమంలో దిగుభాగంలో ఉన్న ఆంధ్ర భూభాగం రైతాంగము ప్రతి ఏడాది ఇదే సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇదే విషయమై గతంలో ఎన్నో పర్యాయాలు ఈ ప్రాంతీయులు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారంలో నేటికిని ఎటువంటి



ఫలితం కానరాలేదని ఈ ప్రాంతీయులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఆంధ్ర, ఒరిస్సా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో వ్యవహరించి ఇరు రాష్ట్రాల రైతాంగానికి ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కారం చేయగలిగితే తప్ప దిగువ ప్రాంతంలోనున్న ఆంధ్ర రైతులకు నీటి కష్టాలు తప్పవని ఇప్పటికైనా సమన్వయంతో వ్యవహరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని ఈ ప్రాంతీయులంతా కోరుతున్నారు.

## గిరిజన యువతకు అవగాహన సదస్సు

**-సొంత ఆలోచనలకు ప్రోత్సాహం..**

**-ఇన్నోవేటివ్ ఐడియాలకు పూర్తి సహకారం**

**-ఐటీడీఏ ట్రైబల్ ఎంటర్ప్రెన్యూర్ చాలెంజ్ -2026**

**- ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్**



**మెళియాపుట్టి, అక్టోబరు 5(వార్త):** గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి సొంత వ్యాపార ఆలోచనలను ఆచరణలోకి తీసుకు వచ్చి విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీతంపేట ఐటీడీఏ వారు ట్రైబల్ ఎంటర్ప్రెన్యూర్ చాలెంజ్ -2026 కార్యక్రమాన్ని ఈ నెల 8న నిర్వహిస్తోందని ఐటీ డీఏ పీవో పవార్ స్వప్నల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సు గాయత్రి విద్యా పరిషత్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్, విశాఖపట్నం మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ రజిని నేతృత్వంలో గిరిజన యువతకు అవగాహన కల్పించనున్నట్లు పీవో తెలిపారు. కావున ట్రైబల్ ఎంటర్ప్రె న్యూర్ చాలెంజ్ -2026 కు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువత సదస్సుకు తప్పకుండా హాజరుకావాలని, ఆరోజు ఉదయం 10 గంటలకు ఐటీడీఏ సమావేశ మంది రంలో ప్రారంభమవుతుందని, ఈ వర్క్ షాప్‌నకు హాజరయ్యే వారికి మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించబడునని పీవో ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు నీలమణి ఆలయంలో వరుణయాగం




**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, పాతపట్నంలో వెలసి యున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నీలమణిదుర్గా అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 'వరుణ జపం,వరుణయాగం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, కార్యనిర్వహణాధికారి బి వాసుదేవ రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుభిక్షంగా, క్షేమంగా ఉండాలని కోరుతూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## హరిపురంలో విద్యార్థులకు కంటి పరీక్షలు




**మందస, అక్టోబరు 5(వార్త):** మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హరిపురం ఎంపీపీ స్కూల్ లో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 35మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ పరీక్షలు జరుపగా, ఇద్దరు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించి, వారికి కళ్ల అద్దాలు వినియోగించాలని సిఫార్సు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, విజయ, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్సీ నర్తు రామారావు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 5(వార్త):** ఇటీవల పలాస హైవేపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సుమారు 70 గొర్రెలు మృతి చెందిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ముక్తపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గుమ్మిడి హరికృష్ణను ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం శ్రీకాకుళం పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాదంలో నాలుగు కుటుంబాలకు చెందిన గొర్రెలు మృతి చెందడంతో ఆయా కుటుంబాలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ఎమ్మెల్సీ తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన హరికృష్ణను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీ ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకుని, లారీ యజమాని ద్వారా బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. హరికృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబానికి అండగా ఉంటానని, ఎటువంటి పరిస్థితుల్లోనూ కుటుంబాన్ని ఆదుకుంటానని ఎమ్మెల్సీ నర్తు రామారావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గద్దిబోయిన కృష్ణరావు, బద్రి సీతమ్మ, కాళ్ల వెంకటరావు, ధర్మాన వెంకటరమణ, రాపాక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం



**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జల జీవన్ మిషన్ -- అమరజీవి జలధార' కార్యక్రమంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గానికి రూ.150 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పథకం కింద నియోజకవర్గ కేంద్రంలోని దువ్వారవీధిలో తాగునీటి పనులకు ఎమ్మెల్యే గోవిందరావు సోమవారం అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించే మహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారని తెలిపారు. ది

ఇందులో భాగంగా పాతపట్నం నియోజకవర్గానికి రూ.150 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా ఈ నిధులతో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మహోపాధ్యాయ జోగినాయుడుకి ఘన సన్మానం



**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక నాయుడు స్కూల్ ప్రాంగణంలో మహోపాధ్యాయులు, బహుముఖ కళా దురంధురులు, బహు భాషా ప్రవీణ పెద్దింటి జోగినాయుడు మాస్టారుకి రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు మరియు నాయుడు గారి అభిమాన బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘన సన్మానం జరిగింది. ముందుగా సరస్వతి దేవి, సర్వేపల్లి, శ్రీనివాస మాష్టర్, దామోదర మాష్టర్ మరియు షణ్ముఖరావు మాస్టర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి విద్యార్థులతో ప్రార్థన జరిపించారు. వక్తలు టి తిరుపతిరావు, బి జనార్ధన్, ఎస్ మధు బాబు, కే చక్రపతి, సవిరిగాన ప్రదీప్ , పి రామరాజు జోగినాయుడు మాస్టారి ఉద్యోగ జీవిత, కళా రంగ ప్రస్థానం, విద్యార్థులను తీర్చి దిద్ది వారికి మార్గ నిర్దేశం చేసిన విధానం గురించి సోదాహరణంగా వివరించారు. విద్యారంగానికి, కళారంగానికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవలను వారు కొనియాడారు. అనంతం జోగినాయుడు మాస్టారుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాస్టారు మాట్లాడుతూ తను ఉపాధ్యాయుడిగా, కళాభిలాషిగా, కళాకారునిగా ఇందరి మన్ననలు అందుకోవడానికి తనకు సహకరించిన కుటుంబ సభ్యులకు, అభిమానులకు, స్నేహితులకు, బంధువులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయ కర్తగా విక్టరీ శంకర్ నడిపించారు.

## గిరిజన శక్తి సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**-జిల్లా అధ్యక్షునిగా సవర కుమార్**

**- జిల్లా మహిళా అధ్యక్షురాలుగా రేవతి**

**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ పట్టులోగాం గ్రామంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను గిరిజన శక్తి సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు సవర నాగేశ్వరరావు, జిల్లా మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి సవర నారాయణరావు, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, గిరిజన సంక్షేమం, రాజ్యాంగబద్ధమైన హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని సంఘం నాయకులు తెలిపారు.

### ఇదే నూతన కార్యవర్గం

గిరిజన శక్తి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా సవర కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా సవర రేవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగాఉపాధ్యక్షులుగా సవర నారాయణ రావు, సవర సుధాకర్, సవర మాధవరావు, సవర ఆనందరావు, సవర రామారావు, సవర కోదండరావు, ప్రధాన కార్యదర్శిగా సవర బాలకృష్ణ, కార్యదర్శులుగా సవర ప్రకాష్, సవర నర సింహులు, కోశాధికారిగా సవర వల్లభరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు పలువురు బాధ్యులను జిల్లా కార్యవర్గంలో నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, గిరిజన సంక్షేమం, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేస్తామన్నారు. మా లక్ష్యం--ఆదివాసీ హక్కుల పరిరక్షణ అన్నారు. గిరిజన గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గిరిజనులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేయడం, విద్య-ఉపాధి-ఆరోగ్యం-భూమి హక్కులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, రాజ్యాంగం కల్పించిన గిరిజన హక్కులు, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడడం నూతన కార్యవర్గం ప్రధాన లక్ష్యంగా పని చేస్తామన్నారు. గిరిజన ప్రజల సమస్యలను రాజకీయాలకు అతీతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన, ప్రజాస్వామ్య మార్గాల్లో పరిష్కారం సాధించేందుకు సంఘం కృషి చేయనుందన్నారు. ఆదివాసీ ఐక్యతే మన బలం-హక్కుల సాధనే మన లక్ష్యమన్నారు. నూతన జిల్లా కార్యవర్గం గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేయాలని పలువురు గిరిజన సంఘ నాయకులు ఆకాంక్షిస్తూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



## రైతులకు నాణ్యమైన జీడి మొక్కల పంపిణీ



**మందస, అక్టోబరు 5(వార్త):** మందస మండలం పరిధిలోని వివిధ రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఉద్యానశాఖ ద్వారా వీ4 నాణ్యమైన జీడి అంటుమొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. మందస మండలంలోని హరిపురంలో సుమారు 4500 మొక్కలను రైతులకు ఉద్యానవనశాఖాధికారి తామరాపల్లి బాలరాజు అందజేశారు. జీడి అంటుమొక్కలను ఎలా నాటుకోవాలి.. పోషక, ఎరువుల యాజమాన్యం, తెగుళ్లు, పురుగుల నియంత్రణను రైతులకు హెచ్.ఓ.బాలరాజు వివరించారు. ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి తామరపల్లి బాలరాజు, మందస మండల గ్రామ ఉద్యాన సహాయకులు అవినాష్, హరి, శ్రీరాములు, సంతోష్, ప్రశాంత్, తులసీరావు, రైతులు పాల్గొన్నారు.

## కవితల పోటీల విజేతగా 'మార్పు'




**మందస, అక్టోబరు 5(వార్త):** అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక నిరంతర సాహిత్య యజ్ఞంలో భాగంగా గుర్రం జాషువా జన్మదినం సందర్భంగా జాషువా కలం-సామాజిక గళం అనే అంశంపై కవితల పోటీ నిర్వహించారు. పోటీల్లో మందస మండలంలోని బిన్నలమదనాపురం గ్రామానికి చెందిన కవి, రచయిత, సామాజిక కార్యకర్త, ప్రజావిజ్ఞానవేదిక కన్వీనర్ టాప్ 20లో నిలిచి, విజేత ప్రశంసాపత్రం పొందారు. శ్రీశ్రీ కళా వేదిక కవితల పోటీలలో ఇప్పటి వరకు 11 ప్రశంసా పత్రాలను ఆయన పొందారు. విజేత మార్పు జగన్మోహనరావు గ్రామస్తు, తోటి ఉపాధ్యాయులు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

## జ్ఞానభారతి ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



**ఇచ్ఛాపురం, అక్టోబరు 5(వార్త):** ఎన్ సి సి 14 ఆంధ్ర బెటాలియన్ ఆదేశాల మేరకు జ్ఞాన భారతి పాఠశాల కార్యదర్శి,ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఎన్ సి సి కాడెట్స్ కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని నీటితో శుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ కే సూర్యారావు పాఠశాల క్యాడెట్స్ ను అభినందించారు. ఎన్సిసి విభాగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జోహార్ ఖాన్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పట్ల విద్యార్థులలో అవగాహన కల్పించి, వారి ద్వారా సమాజంలో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. .ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా ,మేనేజర్ ప్రమోద్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ ,ఎన్ సి సి విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం

**ఇచ్ఛాపురం, అక్టోబరు 5(వార్త):** ఇచ్ఛాపురం శాంతినికేతన్ హై స్కూల్ లో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి స్కూల్ ఛైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణణ్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో మేనేజర్ కె. సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, శాంతి, రవి, జయలక్ష్మి, యశోద, ప్రమీల, పార్వతి, సరోజినీ, రాజేశ్వరి, శిరీష, చాందిని ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి. హర్ష వర్ధన్ రెడ్డి, సెక్రటరీ డి. భార్గవ్, యస్. పి. యల్. స్వాతి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



# తిలారు అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- చిన్నదుగాం, తిలారు జంక్షన్, జగనన్న కాలనీ ప్రజలకు ఇబ్బందులు
- నీటిని తొలగించేందుకు అధికారులు, రైల్వే శాఖ చర్యలు చేపట్టాలని వినతి



**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డైవర్షన్ రోడ్డు, తిలారు అండర్‌పాస్ వద్ద పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. వర్షం తగ్గినప్పటికీ అండర్‌పాస్‌లో నీరు పూర్తిస్థాయిలో తొలగకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిలారు అండర్‌పాస్ మీదుగా చిన్నదుగాం, తిలారు జంక్షన్, జగనన్న కాలనీ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు మరింత అవస్థలు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. అండర్‌పాస్‌లో నీరు ఎక్కువ కాలం నిలిచిపోవడం వల్ల రహదారి దెబ్బతినే అవకాశం ఉందని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అండర్‌పాస్‌లో నిలిచిన నీటిని తక్షణమే బయటకు పంపించేందుకు సంబంధిత అధికారులు, రైల్వే శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నీటిని తొలగించి, భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## పోతయ్యవలస అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

- అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరుపై ఆరా
- చిన్నారులకు పౌష్టికాహారం అందుతున్న తీరుపై పరిశీలన
- గర్భిణులు, బాలింతలకు సక్రమంగా ఆహారం అందించాలని ఆదేశం



**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** పోతయ్యవలసలోని అంగన్వాడీ కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో పి. జగన్మోహన్‌రావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండా కేంద్రానికి చేరుకున్న ఆయన అక్కడి నిర్వహణ, చిన్నారుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంతమంది పిల్లలు హాజరవుతున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నదా లేదా అనే విషయంపై ఆరా తీశారు. పిల్లలకు నిర్ణీత ప్రమాణాల మేరకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రం ద్వారా సేవలు పొందుతున్న గర్భిణీలు, బాలింతలకు కూడా పౌష్టికాహారం సక్రమంగా అందించాలని డిప్యూటీ ఎంపీడీవో ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన తెలిపారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్



**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నరసన్నపేట ఎంఆర్సీ కేంద్రంలో సోమవారం ఎంఈవో ఉప్పాడ శాంతరావు ప్రారంభించారు. విద్యార్థులకు పరీక్షల జూతీవజ్ఝుతీఁఅశీఅకు అవసరమైన పుస్తకాలను అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జలుమూరు మండలం ఎలమంచిలి గ్రామానికి చెందిన సింహాచలం సహకారంతో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని పరీక్షలకు మెరుగ్గా సిద్ధం కావాలని ఎంఈవో సూచించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం వల్ల వారి చదువులో మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 20 మండలాలకు చెందిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు ఎంఈవో వివరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు.

## మూగజీవాలతో బొలెరో వాహనం స్వాధీనం

- 10 దూడలు, మూడు ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు
- మూగజీవులను గోశాలకు తరలించిన పోలీసులు

**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** నరసన్నపేట మండలం మడపాం ప్రధాన రహదారిలోని టోల్ ప్లాజా వద్ద మూగజీవాలను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి. గణేశ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కంచిలి నుంచి తుని వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 10 దూడలు, మూడు ఆవులు ఉన్నట్లు గుర్తించారు. మూగజీవాలను తరలిస్తున్న తీరుపై అనుమానం రావడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం వాహనంలో ఉన్న మూగజీవాలను గోశాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి. గణేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



# పచ్చదనమే గో గ్రీన్ లక్ష్యం



**మందస, అక్టోబరు 5(వార్త):** మందస పట్టణాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా గో గ్రీన్ సంస్థ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మందస బస్టాండ్ నుండి కొత్త వీధి వరకు ఉన్న డివైడర్‌లో, గొడవీధి జంక్షన్, ఎలక్ట్రికల్ బైక్ షోరూమ్, గొల్లవీధి ప్రాంతాల్లో కీలకమైన కార్యక్రమం చేపట్టారు. గత ఏడాది మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన వెదురు గార్డులు ఇటీవల సంభవించిన తీవ్ర తుఫాన్ ధాటికి ధ్వంసమయ్యాయి. మొక్కలకు ముప్పు వాటిల్లకుండా, వాటిని కాపాడుకునేందుకు వెంటనే స్పందించిన గో గ్రీన్ సంస్థ.. ఆ స్థానంలో పటిష్టమైన, నూతన లోహపు గార్డులను అమర్చింది. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ పురుషోత్తంబెహరా మాట్లాడుతూ మొక్కల సంరక్షణ అత్యంత కీలకమనే ఉద్దేశంతో గో గ్రీన్ సంస్థ, ఎస్‌ఎంఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఇప్పటి వరకు 40 వరకు లోహపు గార్డులను ఏర్పాటు చేయడం విశేషమన్నారు. పర్యావరణం పట్ల వారికి ఉన్న అంకితభావానికి, సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొంటూ గో గ్రీన్ సేవలను కొనియాడారు. గో గ్రీన్ సంస్థ సభ్యులు బాలకృష్ణ నాయక్, ప్రసాద్ చౌదరి తదితరులు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించే బృహత్తర కార్యక్రమంలో గో గ్రీన్ సంస్థ, ఎస్‌ఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రతీ ఒక్కరూ ఈ హరిత యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గార్డులను ప్రత్యేకంగా తయారు చేయించి ఏర్పాటు చేయడంలో దాతల సహకారం మరువలేనిదని అన్నారు. నిరంజన్ బెహరా, ప్రదీప్ కుమార్ సాహు మాట్లాడుతూ.. మందస పట్టణ సౌందర్యం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం ఈ సంస్థ నిరంతరం ఇలాంటి సేవలను విస్తృతం చేస్తుందని తెలిపారు. పట్టణంలోని యువకులు, గృహిణులు అందరూ బాధ్యతాయుతంగా మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, పట్టణ పచ్చదనం నిలబడాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని కోరారు. కార్యక్రమంలో మామిడి కోదండరావు, కిమ్మోజీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం వద్దు

- విద్యార్థులకు వేడిగా, రుచికరమైన భోజనం అందించాలి : ఎంఈవో
- చల్లవానిపేట ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ
- విద్యార్థుల హోంవర్క్ పుస్తకాల పరిశీలన

**జలుమూరు, అక్టోబరు 5 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పథకం అమలులో ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని ఎంఈవో-2 ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు సూచించారు. సోమవారం జలుమూరు మండలం చల్లవానిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన పరిస్థితులను పరిశీలించారు. ముందుగా విద్యార్థులు నిర్వహిస్తున్న హోంవర్క్ పుస్తకాలను పరిశీలించి, వాటి నిర్వహణపై ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ ఇచ్చిన పనులను సక్రమంగా పూర్తి చేసేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు



నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, భోజనం వేడిగా, రుచికరంగా ఉండేలా చూడాలని సూచించారు. భోజనం తయారీ, పంపిణీ విషయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న భోజనం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పథకం అమలును నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల సిబ్బందికి ఎంఈవో సూచించారు.

# పాముకాటుతో ఆయా మృతి

- బాడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న చల్ల రాములమ్మ
- నిరుపేద కుటుంబానికి ఉపాధ్యాయుల ఆర్థిక చేయూత
- రూ.77,601లను కుటుంబ సభ్యులకు అందజేసిన ఎంఈవోలు

**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** బాడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న చల్ల రాములమ్మ పాము కాటుకు గురై మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన రాములమ్మ మృతితో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మానవతా దృక్పథంతో స్పందించారు. ఆమె కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సహాయంగా మొత్తం రూ.77,601లను సేకరించారు. సేకరించిన ఆర్థిక సహాయాన్ని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సోమవారం రాములమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

కష్టకాలంలో ఉపాధ్యాయులు అందించిన ఆర్థిక సహాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాములమ్మ కుటుంబానికి అండగా నిలిచిన ఉపాధ్యాయుల చర్యను పలువురు అభినందించారు.




## మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు



**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో సోమవారం 'సంకల్పం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతపట్నం సీఐ కే వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న వేధింపుల నిరోధానికి ఉన్న చట్టాలు, రక్షణ చర్యలపై విద్యార్థులకు వివరంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న దృష్ట్యా, ఆన్‌లైన్ మోసాల పట్ల అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు (డ్రగ్స్) వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు, జీవితాలపై అవి చూపే తీవ్ర ప్రభావాన్ని వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, సాంకేతికతను సరైన మార్గంలో ఉపయోగిస్తూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి కుళాయిలు ప్రారంభం



**సోంపేట, అక్టోబరు 5(వార్త):** మాకన్నపురం గ్రామంలో సోమవారం రాయి మీద వీధిలో 30 కుటుంబాలకు అవసరమైన మంచినీటి కుళాయిలను ఏఎంసీ చైర్మన్ మద్దిల విజయలక్ష్మి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రతి వీధికి మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామ పంచాయతీ నిధులు నుంచి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాలు విజయలక్ష్మి తో పాటు మాజీ సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షణ్ముఖరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్, ఉలాల హరికృష్ణ, మల్ల కోదండరావ్ తదితరులు పాల్గొన్నారు.

## పలాస నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి తాతారావు యాదవ్**

**మందస, అక్టోబరు 5(వార్త):** పలాస నియోజకవర్గంలోని పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి తాతారావు యాదవ్ కోరారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ అసమతుల్యత వలన ఏర్పడిన సూపర్ ఎల్ నినో కారణంగా మన రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో 338మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినందుకు కూటమి ప్రభుత్వ రథసారధి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చన్నాయుడు ధన్యవాదాలు తెలిపారు. పలాస నియోజకవర్గంలోని మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలలో జూన్ లో ప్రారంభం కావాల్సిన ఖరీఫ్ సీజన్ తీవ్ర వర్షాభావం వలన 50శాతం కంటే తక్కువగా సాగు అవ్వడం వెదలు, నారుమళ్ళు ఎండిపోవడం జరిగిందన్నారు. జూన్ నుండి సెప్టెంబర్ వరకు 50 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడం జలాశయాలు కాలువలు పూర్తిగా ఎండిపోయిన విషయం వ్యవసాయ అధికార్లకు విదితమేనని పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరిలో కురిసిన వర్షాలు ప్రాతిపదికన కరువు మండలాలు ప్రకటించడం వలన మూడు నెలలుగా తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండిపోయిన రైతాంగం నష్టపోయిన పరిస్థితి ఉన్నందున శాస్త్రీయ పద్ధతిలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, మా ప్రాంతాన్ని కరువు మండలాలుగా ప్రకటించాలని ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రికి రైతాంగం తరఫున కోరుతున్నానన్నారు



## ఎమ్మెల్యే అశోక్‌తో తరుణరాజ్ భేటీ

**ఇచ్ఛాపురం, అక్టోబరు 5(వార్త):** సోంపేటలో జరిగిన ఫైర్ స్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్‌ను ప్రముఖ అడ్వకేట్, బీజేపీ యువ నాయకుడు గుడిసా తరుణరాజ్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం జిల్లా ఫైర్ ఎస్పీ మోహన్ ని కూడా కలిసి సమస్యలు వివరించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం

- కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి
- ధర్మాన కృష్ణదాస్ పిలుపు
- ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచన
- పోలాకిలో మండల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం




**పోలాకి, అక్టోబరు 5 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ సూచించారు. పోలాకి గ్రామంలో సోమవారం మండలంలోని ముఖ్య కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ శ్రేణులకు కీలకమైనవని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మండలంలోని ముఖ్య కార్యకర్తలు స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. సమావేశంలో పోలాకి మండల వైసీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు

- రేషన్ కిట్లు, పండ్లు, దుప్పట్లు, దుస్తుల పంపిణీ
- శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో పూర్వీకుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం
- గ్రామ సేవ-రామ సేవ లక్ష్యంగా నిర్వహణ



**జలుమూరు, అక్టోబరు 5(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో మహాలయ పక్ష శుభ తిథులను పురస్కరించుకుని పూర్వీకులు, బంధుమిత్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సేవ-రామ సేవ లక్ష్యంగా పలువురు దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలయానికి ఎదురుగా ఉన్న బస్టాండ్‌లో చిన్న టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న దివ్యాంగుడు నెయ్యిల శ్రీనివాసరావును గుర్తించి ఆయనకు రేషన్ కిట్, పండ్లు, దుప్పటి, చొక్కాలను అందజేశారు. మహాలయ పక్షంలో పేదలు, అభాగ్యులు, దివ్యాంగులకు చేయూత అందించడం ద్వారా పూర్వీకుల జ్ఞాపకాలను స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారు, దివ్యాంగులకు తమవంతు సహాయం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకోవచ్చని పేర్కొన్నారు. మహాలయ పక్షంలో అభాగ్యులు, దివ్యాంగులకు అందించే దానం విశిష్టమైనదని వారు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి (2024), శ్రీముఖలింగేశ్వర దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడు గారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

- శాసనం గ్రామంలో అవగాహన కార్యక్రమం



**పలాస, అక్టోబరు 5 (వార్త):** పెండింగ్‌లో ఉన్న కేసులను స్నేహపూర్వక వాతావరణంలో, ఇరుపక్షాల సమ్మతితో సత్వరంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమైన మార్గమని శిక్షణ పొందిన న్యాయవాద మధ్యవర్తి హనుమంతు సుధారాణి తెలిపారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, పలాస సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సూచనలతో సోమవారం లొద్దభద్ర పంచాయతీ పరిధిలోని శాసనం గ్రామంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మధ్యవర్తిత్వ ప్రక్రియ, దాని ప్రయోజనాలు, కేసుల పరిష్కారంలో దాని ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం ద్వారా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను ఇరుపక్షాల అంగీకారంతో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతోపాటు ఇరుపక్షాల మధ్య సత్సంబంధాలను కొనసాగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన వివాదాల స్వభావాన్ని బట్టి మధ్యవర్తిత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన కేసులను కూడా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. అనంతరం గ్రామస్థులకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు.

## రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఖ్యాతి ప్రియ ఎంపిక




- పాఠశాల స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ
- టెక్కలి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి అర్హత
- విద్యార్థినిని అభినందించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

**సారవకోట, అక్టోబరు 5 (వార్త):** సారవకోట నవతేజ పాఠశాలకు చెందిన విద్యార్థిని బొద్దాన ఖ్యాతి ప్రియ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పి. తేజేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆదివారం టెక్కలిలో నిర్వహించిన పాఠశాల స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఖ్యాతి ప్రియ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. చిన్న వయసులోనే చెస్‌పై ఆసక్తి పెంచుకుని పోటీల్లో పాల్గొంటూ ప్రతిభను చాటుకుంటున్న ఖ్యాతి ప్రియ, టెక్కలిలో జరిగిన పోటీల్లో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ఖ్యాతి ప్రియ పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థిని భవిష్యత్ పోటీల్లో మరింత ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- పొలం వద్ద తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో ప్రమాదం
- దివీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగం చేస్తున్న హేమసుందర్ మృతి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై రంజిత్



**పోలాకి, అక్టోబరు 5 (వార్త):** పోలాకి మండలం దీర్ఘాసిలో విద్యుత్ షాక్‌కు గురై మెండ హేమసుందర్ (24) మృతి చెందాడు. దివీస్ ల్యాబ్స్‌లో ఉద్యోగం చేస్తున్న హేమసుందర్ సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు.ఐఆదివారం సాయంత్రం పొలం చూసేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగ అతడికి తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర షాక్‌కు గురైన హేమసుందర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడని భావించిన కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఎస్సై రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## రీ సర్వే భూ సమస్యలు పరిష్కరించాలి

- కూర్మనాధపురం పంచాయతీ పరిధిలో భూ రికార్డులపై ఫిర్యాదు
- సర్వే నంబర్లు, విస్తీర్ణం నమోదులో లోపాలపై అధికారుల దృష్టికి
- తప్పుగా నమోదైన భూ వివరాలను సరిచేయాలని విజ్ఞప్తి



**సారవకోట, అక్టోబరు 5 (వార్త):** కూర్మనాధపురం పంచాయతీ పరిధిలో రీ సర్వే సందర్భంగా తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించి, రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. రీ సర్వేలో భాగంగా కొన్ని భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, భూముల ఫొటోల నమోదులో తేడాలు ఉన్నట్లు ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఒకరి భూమి వివరాలు మరొకరి పేరున నమోదైన సందర్భాలు ఉన్నాయని, దీంతో సంబంధిత భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరికొన్ని భూములకు సంబంధించిన వన్‌బీ సర్వే నంబర్లు రికార్డుల్లో కనిపించకపోవడం వల్ల భూ యజమానులకు సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. రీ సర్వే రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ యజమానుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం తప్పులను సరిచేయాలని కోరారు. భూ రికార్డుల్లో నెలకొన్న లోపాలను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఉమామహేశ్వరరావు అధికారులను కోరారు.

## వినాయక నవరాత్రుల ఆటల పోటీల విజేతలకు బహుమతులు

- వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం
- ఎనిమిదేళ్లుగా భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాల నిర్వహణ
- వేలాది మంది భక్తులతో అన్నసమారాధన

**నరసన్నపేట, అక్టోబరు 5(వార్త):** నరసన్నపేటలోని శ్రీదేవి నగర్, సాయినగర్ ప్రాంతాల్లో నిర్వహించిన వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా చిన్నారులు, యువతతో పాటు స్థానికులు ఉత్సాహంగా పాల్గొనేలా పలు రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన వారికి కమిటీ సభ్యులు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీదేవినగర్, సాయినగర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటూ ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. 2026లోనూ నవరాత్రి మహోత్సవాలను ప్రత్యేక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించిందని, విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని కల్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా ఉత్సవాల ముగింపు సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



## అసంపూర్తి భవనాలతో చిన్నకిట్టాలపాడు పాఠశాలకు అవస్థలు

- రెండేళ్లుగా నిలిచిపోయిన అదనపు భవనాల నిర్మాణ పనులు
- రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- సరైన రహదారి లేక విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు

**సారవకోట, అక్టోబరు 5 (వార్త):** చిన్నకిట్టాలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణ పనులు రెండేళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల అవసరాల కోసం చేపట్టిన నిర్మాణ పనులు పునాదుల నుంచి స్లాబ్ వరకు పూర్తయిన అనంతరం నిలిచిపోవడంతో భవనాలు వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారాయి. నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో భవనాల పరిసర ప్రాంతం నిర్వహణ లేకపోవడంతో సమస్యాత్మకంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని సోమవారం వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల ఆవరణ భద్రతపై కూడా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పాఠశాలకు వెళ్లే రహదారి సరిగా లేకపోవడం వల్ల నిత్యం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారడంతో పాఠశాలకు రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న అదనపు భవనాల నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తిచేయాలని, పాఠశాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.





## రైతుల శ్రమదానం

**ఇచ్ఛాపురం, అక్టోబరు 5(వార్త):** ఎవరో వస్తారని ఎదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రభుత్వాలు పై ఆధార పడితే పుణ్యకాలం కాస్త పోతుందని రైతులు మేలుకున్నారు. అయ్యోరు వచ్చేవరకు అమావాస్య ఆగదని భావించి వారే తేరుకున్నారు. బాహుదా నది పరీవాహిక ప్రాంతం లో బెల్లుపడ రెవిన్యూ గ్రామం పరిధిలో సుమారు 1800 ఎకరాలు ఆయుకట్టు ఉంది. బహుదా ఇరిగేషన్ ఛానెల్ లు మరమ్మత్తులు కి గురి అయ్యి పంట పొలాలు కి నీరు అందండం లేదు.గ్రామ రైతులందరూ ఐక్యంగా ముందడుగు వేసి బహుదా నది ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను స్వచ్ఛందంగా తొలగించే కార్యక్రమాన్ని (శ్రమదానం) చేపట్టారు.పంట పొలాలకు నీరు సజావుగా అందాలనే లక్ష్యంతో రైతులే స్వయంగా రంగంలోకి దిగారు. కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తుప్పలు మరియు పూడికను తొలగించి, నీటి ప్రవాహానికి ఉన్న ఆటంకాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వంతు సహాయసహకారాలు అందించారు. రైతులందరూ ఒక్కటై చేసిన ఈ శ్రమదానం గ్రామస్థులందరికీ మరియు ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు .ఐకమత్యంతో శ్రమించిన రైతు సోదరులందరికీ గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# 77 కుటుంబాల సొంతింటి కల సాకారం

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 కింద గృహ మంజూరు ఉత్తర్వులు

### -లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేసిన ఎమ్మెల్యే శిరీష



**పలాస, అక్టోబరు 5 (వార్త):** అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన--అర్బన్ 2.0 పథకం కింద పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎంపికైన 77 మంది లబ్ధిదారులకు మంజూరైన గృహాల ఉత్తర్వులను సోమవారం ఆమె అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, స్థిరత్వాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు అద్దె ఇళ్లపై ఆధారపడకుండా శాశ్వత నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి ఆవాస్ యోజన--అర్బన్ 2.0 పథకాన్ని అమలు చేస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తాజాగా 77 మంది లబ్ధిదారులకు గృహ మంజూరు ఉత్తర్వులు అందించడం పలాస ప్రాంతంలో సొంతింటి కలను సాకారం చేసే దిశగా మరో ముందడుగని అన్నారు. గృహ మంజూరు ఉత్తర్వులు పొందిన లబ్ధిదారులు సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారుల సూచనలు, మార్గదర్శకాలను పాటిస్తూ తదుపరి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పథకం నిబంధనలకు అనుగుణంగా గృహ నిర్మాణాన్ని చేపట్టి, నిర్ణీత సమయంలో ఇళ్లను పూర్తి చేసుకునేలా అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. గృహ నిర్మాణంలో నాణ్యతకు రాజీపడకుండా, లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకం ద్వారా మంజూరైన ఇల్లు కేవలం భవనం మాత్రమే కాదని, ఒక కుటుంబానికి భద్రమైన భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. గృహ నిర్మాణ ప్రక్రియలో లబ్ధిదారులకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించి, నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. 77 మంది లబ్ధిదారులకు గృహ మంజూరు ఉత్తర్వులు అందించడం పట్ల ఎమ్మెల్యే గౌతు శిరీష సంతోషం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాలు పూర్తయి ఆయా కుటుంబాలు సొంత ఇళ్లలో గృహప్రవేశం చేసే రోజు నిజమైన విజయదినమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి ముఖ్య టీడీపీ నాయకులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

### అమరజ్యోతిలో ఘనంగా 'ఉపాధ్యాయ దినోత్సవం'

**పాతపట్నం, అక్టోబరు 5(వార్త):** పాతపట్నం అమరజ్యోతి పాఠశాలలో 'ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం' వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గత 28 సంవత్సరాలుగా ఆంగ్ల ఉపాధ్యాయునిగా సేవలు అందిస్తూ, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఆంగ్ల బోధనలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వైస్ ప్రిన్సిపల్ ఇప్పిలి మురళీకృష్ణను పాఠశాల యాజమాన్యం, అధ్యాపక సిబ్బంది అత్యంత ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం సోమేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభ దశ నుంచి నేటి వరకు మురళీకృష్ణ తమకు కుడిభుజంలా ఉంటూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని చైతన్యవంతులను చేయడంలో ఆయన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం మురళీకృష్ణకు దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



# సర్దార్ కృషి చిరస్మరణీయం

### - 1963లో సోంపేట అగ్నిమాపక కేంద్రానికి సర్దార్ పునాది

### -కోటి రూపాయలతో మరింత అభివృద్ధి

### - నూతన భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్



**సోంపేట, అక్టోబరు 5(వార్త):** సోంపేట పరిసర ప్రాంతాల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధి సాధనలో నాటి స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న కృషి ఎనలేనిదని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. 1963 లో సోంపేట అగ్నిమాపక కేంద్రానికి గౌతు లచ్చన్న కృషితో పునాదిరాయి పడిందని గుర్తు చేశారు. ఈరోజు అదే భవనం కూటమి ప్రభుత్వ హయాంలో మరింత సుందరంగా తీర్చిదిద్దబడిందని, సౌకర్యాలు మెరుగుపరచబడ్డాయని పేర్కొన్నారు. అటువంటి మహనీయుని చిత్రపటం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అధునాతన సౌకర్యాలతో నిర్మించబడిన నూతన అగ్నిమాపక కేంద్రం భవనాలను ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించబడ్డాయి. వివిధ శాఖల అధికారులు, రాజకీయ ప్రముఖులు, స్థానికులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా ఘనంగా జరిగింది. స్థానిక స్టేషన్ ఆఫీసర్ సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అశోక్ ఫిదా అయ్యారు. సూర్యారావు పర్యవేక్షణలో చక్కనైన ఏర్పాట్లతో అంకితభావంతో కార్యక్రమం రూపొందించడం పట్ల అందరినీ అభినందించారు. అగ్నిమాపక సేవలు చాలా విలువైనవని కొనియాడారు. అత్యవసర పరిస్థితుల్లో అలాగే అగ్ని ప్రమాద సందర్భాల్లోనూ ఇటువంటి సిబ్బంది సేవలు అమూల్యమైనవని అన్నారు. అటువంటి అధికారులు, సిబ్బందిని ప్రజలు ఎల్లవేళలా ప్రోత్సహించి వారిని గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇటువంటి మంచి భవనాన్ని తన చేతుల మీదుగా శంకుస్థాపన చేసి ఏడాది కాలంలోగా మళ్ళీ ప్రారంభోత్సవం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో నాణ్యతతో మంచి అందంగా తీర్చిదిద్దిన కాంట్రాక్టర్ ను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్ రావు, సోంపేట సిఐ మంగరాజు, ఎక్సైజ్ సీఐ జీవీ రమణ, కూటమి నాయకులు దాసరి రాజు, సూరాడ చంద్రమోహన్, మద్దు కుమార్, మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శేఖర్ బీన ఆనందరావు, బీన వంశీ, బీన ప్రదీప్, బంగారు కురయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్త సుహితకు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారం



**పలాస, అక్టోబరు 5 (వార్త):** నిరుపేద కుటుంబంలో జన్మించి, ఎన్నో కష్టాలను అధిగమిస్తూ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన బోకర సుహిత అంగన్వాడీ కార్యకర్తగా అంకితభావంతో సేవలందిస్తున్నారు. గత 18 ఏళ్లుగా మాకన్నపల్లి అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సమర్థంగా చేరువ చేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర పురస్కారంతో సత్కరించింది.

సుహిత శ్రీకాకుళంలో విద్యాభ్యాసం పూర్తి చేసి బీఏ పట్టా పొందారు. అనంతరం 2008 ఫిబ్రవరి 25న మాకన్నపల్లి అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి నేటి వరకు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడం, గర్భిణులు, బాలింతలకు అవసరమైన సూచనలు, పోషకాహారంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలోని తల్లులు, పిల్లలు, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని అంగన్వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, చెత్త నిర్వహణ, స్వచ్ఛత ప్రాధాన్యతపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

గామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలను చైతన్యపరచడంలో ఆమె చూపిన చొరవకు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ నేపథ్యంలో ఆమె సేవలను గుర్తించిన అధికారులు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారానికి ఎంపిక చేశారు. అక్టోబరు 2న నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా బోకర సుహిత స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాన్ని అందుకున్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి, అంగన్వాడీ కార్యకర్తగా బాధ్యతాయుతంగా సేవలందిస్తూ గుర్తింపు పొందడం సుహిత సేవాభావానికి నిదర్శనమని గ్రామస్థులు అభినందించారు. ఆమెకు లభించిన ఈ పురస్కారం అంగన్వాడీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఓ కే పార్వతి, సూపర్వైజర్ యు లత వెల్లడించారు.

# జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక



**పలాస, అక్టోబరు 5 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పురుషులు, మహిళల టెన్నికాయిట్ జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు క్రీడా పోటీల నిర్వాహక కార్యదర్శి పి. తవిటయ్య తెలిపారు. పురుషుల విభాగంలో కె. ప్రవీణ్ కుమార్, బి. ఉదయ్ కిరణ్, బి. సిద్ధార్థ, కె. జయంత్ ఎంపిక కాగా, కె. గౌతమ్, కార్తీక్ మహర్న స్టాండ్బై క్రీడాకారులుగా ఎంపికయ్యారు. మహిళల విభాగంలో ఎన్. దివ్య, ఎం. హర్షిని, శుభశ్రీ సాహూ ఎంపికయ్యారు. కె. మానస, జె. జ్యోత్స్న స్టాండ్బై క్రీడాకారులుగా నిలిచారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 50వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని పి. తవిటయ్య తెలిపారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, కార్యదర్శి సుడియా వెంకట జోగారావు, ఎంఈఓ బి.వి. రమణ, క్రీడల ప్రోత్సాహకులు బద్రి గోపాల్, జె. రామారావు, సునీల్ సాకి తదితరులు పాల్గొన్నారు.

# అమలకుడియలో రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం

### -ప్రారంభించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, అక్టోబరు 5 (వార్త):** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం అమలకుడియ గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా ఆరోగ్య మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గ్రామస్థులు చిన్నపాటి అనారోగ్య సమస్యలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సలహాలు, ఆరోగ్య పరీక్షలు పొందేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు గ్రామస్థాయిలో వైద్య కేంద్రాలు కీలకంగా నిలుస్తాయని అన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, అవసరమైన పరీక్షలు నిర్వహించడం, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు అందించడం వంటి కార్యక్రమాలకు ఈ కేంద్రం వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రోగులను సూచించడం ద్వారా ప్రజలకు సకాలంలో తగిన చికిత్స అందేలా మార్గదర్శకత్వం కల్పించవచ్చని తెలిపారు. క్లినిక్లో అందుబాటులో ఉండే వైద్య సేవలు, సిబ్బంది, సేవా సమయాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాన్ని పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించడంతోపాటు తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను నిరంతరం అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అమలకుడియలో విలేజ్ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి రావడంతో గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలకు మరింత చేరువ ఏర్పడిందని, దీని ద్వారా ప్రజలకు సకాలంలో వైద్య సలహాలు, ఆరోగ్య సేవలు అందే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్, మండల టిడిపి ముఖ్య నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలి




**జి.సిగడాం, అక్టోబరు 5(వార్త):** పున్నాం పంచాయతీ గ్రామస్తులు మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ గ్రామాల పరిధిలో 152 హెక్టార్లలో సర్వే జరిపి మాంగనీస్ బ్లాక్ లో ఖనిజాన్వేషణకు వేదాంత మైనింగ్ కంపెనీకి అనుమతులు ప్రభుత్వం ఇస్తుందంటూ వచ్చిన సమాచారంతో చుట్టుపక్కల గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మైనింగ్ కార్యకలాపాలు జరిగితే చుట్టుపక్కల పంట పొలాలు బీడు భూములుగా మారుతాయి అని భూగర్భ జలాలు సైతం దెబ్బతిని వ్యవసాయాలు పూర్తిగా నాశనం అవుతాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామంతా వ్యవసాయ ఆధారిత రైతులు మని వ్యవసాయాలు లేకుంటే తమ జీవనోపాధి పూర్తిగా కోల్పోయి రోడ్డును పడతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. రైతులంతా ఏకమై తహసిల్దార్ కార్యాలయం ఆందోళన చేపట్టారు. అనంతరం అనుమతులను ఇవ్వకూడదంటూ వినతిపత్రం అందజేశారు.



# సరాళి రోడ్డు, లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించాలి

**పాతపట్నం, అక్టోబరు 5 (వార్త) :** సరాళి గ్రామ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు, ఊరికి సాగునీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మరియు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యాలయంలో సరాళి గ్రామ రైతులు మరియు బీజేపీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. పాతపట్నం నియోజకవర్గ బీజేపీ బిఎల్ఏ-1 సిరిపురం త్రివేణి నేతృత్వంలో గ్రామస్థులు మొదట ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలసి తమ సమస్యలను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, సరాళి గ్రామ సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా పరిషత్లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, సిరిపురం త్రివేణిలతో కలిసి జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. అలాగే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యాలయంలోనూ వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ పాతపట్నం నుంచి సరాళి వరకు రోడ్డు పనుల్లో భాగంగా మెటల్ వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరాళి గ్రామంలో సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉన్నప్పటికీ సరిపడా సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ఇక్కడ ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో సమస్య మరింత సంక్లిష్టంగా మారిందన్నారు. తక్కువ ఖర్చుతోనే ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించి రైతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించవచ్చని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ ఈ అంశంపై స్పందిస్తూ శాశ్వత పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఎర్రగుంట్ల జగన్మోహన్, తోనంగి వెంకన్న యాదవ్, సాధు కిరణ్, అసిరినాయుడు, మదన్, బైరి అప్పారావు, సూర్య, బీజేపీ పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖ రావులతో పాటు సరాళి గ్రామ రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546